న్యూజెర్సీ కళాసమితి, ఆంధ్రజ్యోతి
సచిత్రవారపత్రిక సంయుక్తంగా
నిర్వహించిన '97 కథల పోటీలో
సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

# ముష్టిపిల్ల

– ఎలక్ట్రాన్



వారం రోజులు ప్రాజెక్టు ఏరియాలో మకాం వేసి, పని పూర్తిచేసుకొని, జమ్మూలో ఆ ఆదివారం ఉదయం ఇల్లుచేరిన నాకు ముందువరండాలో కూర్చుని, నా శ్రీమతి నీలవేణితో కబుర్లు చెప్తున్న శ్రీపతీ, అతని భార్య సుశీలా కనబడ్డారు. శ్రీపతి నా బాల్యస్నేహితుడు. రైల్వేస్‌లో జబల్‌పయర్‌లో పనిచేస్తున్నాడు. ఆరేళ్ళ తర్వాత వాణ్ణి చూడటంతో, నా ఆనందానికి హద్దులు లేవు. వైష్ణవీదేవిని దర్శనం చేసుకొని, తిరుగుప్రయాణంలో మా ఇంట్లో దిగారన్నమాట. ముందు పలకరింపులూ అవీ అయిన తర్వాత నేను లోపలికిపోయి, స్నానం అదీ చేసి, మడత బట్టలు కట్టుకొని ఓ రగ్గు కప్పుకొని వరండాలోకి వచ్చాను. నీలవేణి అందరికీ వేడి వేడి ఇడ్లీలు, కాఫీలు అందించింది. బ్రేక్‌ఫాస్ట్ పూర్తైన తరువాత కబుర్లలోకి దిగాం. వైష్ణవీదేవియాత్రా విశేషాలు చెప్తూ దారి పొడుగునా కూర్చుని సతాయించిన బిచ్చగాళ్ళ ప్రసక్తి తీసుకొచ్చారు శ్రీపతి దంపతులు.

"మువ్వే పుణ్యక్షేత్రానికి వెళ్ళినా ఇంతే! పళ్లెంలో వేసిన దక్షిణ్ణ పూజార్లకు దక్కుతుంది. దానపేటికలో వేసిన డబ్బు దేవసథానానికి వెడుతుంది. ఆడబ్బెలా వినియోగింపబుతుందీ అన్నది, ఆ గుడివేలువుకే తెలియాలి! గుడిదారిలో, గుడి ముందర గుడ్డలు పరచుకొని కూర్చునే బిచ్చగాళ్ళకి డబ్బులు పడేస్తే అది ముష్టి. ఓ చిన్నసైజు దానం! అయితే ఈ మూడింటిలో ఏది ఎక్కువ పుణ్యాన్నిస్తుందీ అన్నదానికి సమాధానం గుడికి వెళ్ళే వ్యక్తుల మనస్తత్వాల మీద ఆధారపడి వుంటుంది. ఇటువంటి ఆలోచనలకు ప్రతి వ్యక్తీ అంతో ఇంతో కాసిని డబ్బులు వాళ్ళకి వేద్దామని మనసు తొందర చేసినా, ఎవరికని వేసేది? ఎంతమంది కనివేసేది? అదీకాక దానం చెయ్యడం సులువేమో కానీ, దానికి అర్హుడెవరో నిర్ణయించడం చాలాకష్టం......!" నా ఉపన్యాస ధోరణికి నీలవేణి అడ్డువేసింది.

"చాలాకాలం తరువాత తీరుబడిగా కూర్చుని, తెలుగువారితో మాట్లాడే అవకాశం ఈరోజే దొరికింది శ్రీవారికి! మీరు వింటూ కూర్చుంటే, ఆ ప్రవాహానికి అడ్డుండదు, జాగ్రత్త!" అని నీలవేణి నవ్వుతూ వాళ్ళని హెచ్చరించింది. పదిరూపాయిల చిల్లరా పావుగంటలో అయిపోయింది! తీరా నిజమైన గుడ్డివాళ్ళూ, కుంటివాళ్ళూ కంటబడేరికి, అయిదు రూపాయిల 50 కాగితాలు తప్ప మరేమీ లేకపోవడంతో, కిమ్మనకుండా వాళ్ళని దాటుకొంటూపోయాం. ఆ ముష్టివాళ్ళ దగ్గరే చిల్లర మార్చడానికి మనసొప్పలేదనుకో!" అన్నాడు శ్రీపతి.

"చూశావా మరీ!?మరోపదిరూపపాయిల చిల్లరుంటే, వాళ్ళకి ఏదో ఇంత విదిలించేవాళ్ళం కానీ, ఆ ఇరవై రూపాయిలూ నిజంగా ???? ఏ ఒక్కరికో, ఇద్దరికో ఇవ్వడానికి మనస్కరించదు....!" ఇంకా ఏదో అనబోయేంతలో, గేటు తలుపు తీసిన శబ్దం వినిపించి, అటువైపు చూశాను.

ఓ పదకొండ, పన్నెండు సంవత్సరాల వయసులో వున్న పిల్ల ఆవరణ దాటి, వరండా మెట్ల వరకూ వచ్చి "ధర్మం చెయ్యండి బాబూ" అంటూ చేయిచాచి నిలబడింది.

"ఎక్కణ్ణుంచి దావురించిందోకానీ, నాలుగురోజుల్నించి ప్రాణాలు తోడేస్తోంది.! ఓ పావలా పడేస్తేనే కానీ కదల్లల్లేదు! అంటూ కుర్చీలోంచి లేవబోయిన శ్రీమతిని చూసి, కూర్చోమన్నట్లుగా సైగ చేశాను. అదే నేను చేసిన పొరపాటు.

చిన్నవయసులో వున్న ఆపిల్ల, చింపిరి జుట్టుతో, చిరిగిన బట్టలతో వుంది. రంగుమాసిన స్వెట్టరు గుండీలు వుండవలసిన చోట, గుడ్డపీలికలతో బిగించి కట్టుకొంది. చూడ్డానికి తగినంత ఆరోగ్యంకా కనబడకపోయినా, ఆకలిబాధతో శుష్కించిన చిహ్నాలు మట్టుకులేవు. ఆకర్షించుకునే దీనత్వం మటుకు కళ్ళలో కొట్టవచ్చినట్లుకనబడింది. ఒక్కక్షణం జాలి కలగకపోలేదు. అయినా కాస్త కర్కశంగా అన్నాను. "దుక్కలా వున్నావు! ముష్టెత్తుకోడానికి సిగ్గులేదూ!!"

చాచిన చెయ్యినలాగేవుంచి, "ధర్మం చెయ్యండి తల్లీ! ఆకలేస్తోంది" అందా పిల్ల, రెండో చేత్తో మొహంమీద పడ్డ జుత్తుని సవరించుకొంటూ.

నాలుగురోజుల్నుంచీ డబ్బులు విదిలిస్తున్న శ్రీమతికి, నలుగురిమధ్యా

వుండటం వల్ల ధైర్యం వచ్చిందను కొంటాను, "ఈరోజున నీకు నయా పైసా కూడా ఇచ్చేదిలేదు. సతాయిం చక బయటకు పో" అన్నది విసురుగా. అయితే ఈ విసుర్లూ, కసుర్లూఆ పిల్ల మీద పనిచేసినట్లులేవు. అక్కడే నిలు చుని, ఆదేవరుస! "ధర్మం చెయ్యండి, దేముడు మీకు మేలుచేస్తాడు"

శ్రీమతి ఏదో అనబోయి, నన్ను చూసి ఆగిపోయింది. "నువ్వింక అనవసరంగా మాట్లాడకు, ఈ పిల్ల సంగతి నేను చూస్తాను" అంటూ కుర్చీలోంచి లేచాను. కప్పుకున్న రగ్గు జారిపోయింది. వేసుకున్న పలచ్చటి స్వెట్టర్లోంచి వెన్నుకొచ్చి తగిలించి నవం బరు నెల చలిగాలి. చిరిగిన బట్టల్లో వున్న ఆపిల్లకెంత చలిగావుందో! మళ్ళీ ఒక్కక్షణం ఆదేజాలి! అయినామ నసు కటువుచేసుకొని అన్నాను."ఇం దాకటి మాటే ఇప్పుడూ అంటున్నాను. ఏదో పని చేసుకొని బ్రతకాలి కానీ, ఇలా ముష్టెత్తుకుకాదు! సరే, రూపా యిస్తాను, ఆమొక్కలికి నీళ్ళుపొయ్యి! ఏమంటావ్?"

"మీరో ఉద్ధరిస్తారు అనుకొంటే, పావ లాతో వదిలిపోయేదానికి రూపాయి తగలెడ్తున్నారు.! "శ్రీమతి మాటలకు శ్రీపతి దంపతులు చిన్నగా నవ్వారు. వాళ్ళ చిరునవ్వు మరింతగా నన్ను రెచ్చగొట్టింది. "రూపాయి కాక పోతే, రెండురూపాయిలిస్తాను. ఆ మూలనున్న చీపురుతీసి, పంపుచుట్టూ పడివున్న ఆకులను, వీధిలోవున్న చెత్త కుండీలో పొయ్యి. ఆ చిన్న ప్లాస్టిక్ బాల్చీలో నీళ్ళు నింపి, మొక్కలికి పొయ్యి" అన్నాను.

"అమ్మా, ఆకలేస్తోంది! ఓ పావలా దానం చెయ్యి!"

"ఏమైనాసరే, నీకు ఊరికే డబ్బులి చ్చేదిలేదు. ఈ కాస్త పనీ చెయ్యడానికి పావుగంట కూడా పట్టదు. ఆలోచిం చుకో, లేకపోతే,నువ్వు రోజల్లా ఇక్కడే నిల్చున్నా, నయాపైసా ఇచ్చేదిలేదు!" అంటూ కుర్చీలో కూర్చున్నాను.

అయిదు నిముషాలు నిశ్శబ్దం ఆవ రించింది. వున్నట్టుండి ఆపిల్ల పంపుద గ్గరకు వెళ్లి చీపురు తీసుకొని తుడ వసాగింది. నేను విజయగర్వంతో చూశాను.

'ఇప్పుడే కదా కాఫీ త్రాగింది? ఇంకేమీ వద్దన్న వాళ్ళ మాటల్ని పట్టించుకో కుండా, టీ చేసి పట్టుకురమ్మని శ్రీమ తిని. లోనికి పంపాను. ఆ పిల్ల పనిచే స్తున్న తీరు గమనించసాగాన. తుడ వడంలో అనుభవం కనిపించలేదు. అయినా కష్టపడి ఆకుల్ని తుడిచి, బాల్చీలోకి ఎత్తి, బయట కుండీలో పారపోసి వచ్చింది. నీళ్ళు పొయ్య డంలో పర్వాలేదనిపించింది. పనిచేసి వరండా మెట్లదగ్గరకు వచ్చి, కిందమె ట్టుమీద కూర్చుని, చేతులు చూసు కుంటూ కూర్చుంది. నీలవేణి ఆపిల్లకు ఓ పాతకప్పతో టీ ఇస్తూ, పేరేమిటని అడిగి 'దుర్గ' అని తెలుసు కొంది. కొంచెంగా సంకోచిస్తూనే టీ కప్ప అందుకొంది. టీ త్రాగి పంపుదగ్గ రకు వెళ్లి కప్పని కడిగి, వరండాపైమెట్టు దగ్గరపెట్టి మళ్ళీ కూర్చుంది., అదే ఆ చిన్న సంస్కారచిహ్నం నిజానికి నాకు చాలా బాగా వచ్చింది.

"డబ్బులు తీసుకురా," అన్నాను నీల వేణితో. నీలవేణి లోపలికివెళ్లి రెండు అర్ధరూపాయిలు, నాలుగుపావలాలూ చిల్లర తీసుకొచ్చి నా చేతిలో పోసింది. దుర్గని పైకి వరండాలోకి రమ్మన్నాను. వున్న నాలుగు మెట్లూ నెమ్మదిగా ఎక్కి వచ్చి, నా కుర్చీకి దగ్గరగా నిల్చుంది. దుర్గచేతిలో ఆ డబ్బులు లెక్కించి వేస్తూ, "చూశావా, నీకిప్పుడెంత సంతో షంగావుందో! కష్టించి పనిచేస్తే వచ్చే ప్రతిఫలం తృప్తినిస్తుంది., గౌరవాన్ని స్తుంది. అన్నాను.

దుర్గ కళ్ళలో చిన్న వెలుగు! మాకేసి ఆశగాచూస్తూ అంది. "నేనిలా రోజూ వస్తే పని ఇప్పిస్తారా అయ్యగారూ"

'ఓ' అనబోయి తమాయించుకు న్నాను. దుఉర్గచేత పంతంకొద్దీ పనిచే యించానే కానీ, అవసరముండి కాదు. ఆరేళ్ళనుంచి పనిచేస్తున్న పనిమనిషి ఉండగా, వేరేపనిపిల్ల అవసరంలేదు. మా అందరికేసి చూసి దుర్గ చిన్నగా తలాడించింది. చేతిలో వున్న నాలుగు పావలాకాసుల్ని బల్లమీద పెట్టింది. మెట్లుదిగుతూ, పైమెట్టుమీదున్న టీ కప్పలో రెండు అర్ధరూపాయి కాసులూ పడవేసింది. ఆతర్వాత వడివడిగా నడు చుకొంటూ, గేటు తీసుకుని బయటకు వెళ్లిపోయింది.

'మాకందరికీ మతులుపోయాయి" ఆ పిల్ల చేసిన పని నీకర్థమైందా శ్రీపతీ?" అన్నాను

"పనిచేస్తే రెండురూపాయిలిస్తాన న్నాను. దుర్గ చేసింది. నువ్వన్నట్లుగా ఇచ్చావు. బల్లమీద రూపాయి వదిలి నాలుగురోజుల ముష్టికీ చెల్లుకొట్టింది! మిగిలిన రూపయితో, ఇచ్చిన టీకి బిల్లు చెల్లించింది! నీ నీతిబోధ పని చేసిందనుకొంటాను, తన పౌరుషం చూపించి, అభిమానం కాపాడుకుంది. అన్నాడు శ్రీపతి.

"కాదు, శ్రీపతీ! కష్టించి పని చెయ్యాలి కానీ ముష్టెత్తుకోకూడదని చెప్పడం సులువు. ఆపని దొరికేట్లు చెయ్యడం కష్టం. అయితే చేతు లుచాచి యాచనచేస్తే దానాలు చేసే దాతలు దొరక్కపోరు! ఈ విషయాన్ని దుర్గ నోరువిప్పి చెప్పకుండా రుజా వుచేసి మరీ వెళ్లింది.!" అన్నాను ఓడిపోయిన ముఖంతో....

"నేను ముందే చెప్పాను! పావలాతో వదిలిపోయేదానికి ఇంత రాద్ధాంతం చేశారు!" అంది నీలవేణి సాగదీస్తూ....

నామాటలకింతకంటే తార్కాణం ఏంకావాలి?

●



**భార్యా విధేయుడు :**

అర్థం పర్థం లేకుండా మీ ఆవిడ ఎవరితో పోట్లాడినా మీరు మీ ఆవిడనే వెనకేసుకొస్తా రెందుకని? కోపంగా అడిగాడు పక్కింటి వ్యక్తి.

ఆవిడకి సర్థి చెప్పి తిట్లు తినడంకంటే బయ టివాళ్ళకు సర్ది చెప్పడమే తేలిక చెప్పాడా భార్యా విధేయుడు.

**లంచం :** ప్రిన్స్‌పాల్‌ని ఆసక్తిగా అడిగాడు టీచర్ "ప్యూన్ ని డిస్మిస్ చేశారట. ఎందుకని"

"లాంగ్ బెల్ అరగంట ముందు కొడతానని చెప్పి పిల్లల దగ్గర అర్థ రూపాయి చొప్పన లంచం తీసుకొని కూడా బెల్ కొట్టలేదండీ వెధవ" అన్నాడు.

—కాట్రగడ్డ వెంకట్రావు.



